జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 8-4-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 638 పేజీలు: 4 వెల : రూ.7


# జీఎస్టీ అధికారులమని చెప్పి.. బంగారం చోరీ

* వెంకటేశ్వర జ్యాయలరీ షాపులో తనిఖీ * షాపు యజమానికి బేడీలు * ఆ తర్వాత బిల్లుల తనిఖీ * బంగారానికి రికార్డులు లేవని వ్యాపారికి బెదిరింపు * బ్యాగుల సర్దిన 750 గ్రాముల బంగారం * ఆఫీసుకు వచ్చి కలవాలని ఆదేశం * ఆపై కారులో ఆ నలుగురు పరారీ * పోలీసులకు ఫిర్యాదు చేసిన బంగారం వ్యాపారి * రంగంలోకి దిగిన పోలీసులు, క్లూస్‌టీమ్







పలాస, ఏప్రిల్ 7 (వార్త): పలాసలో పట్టపగలే భారీ దోపిడికి నలుగురు వ్యక్తులు తెగబడ్డారు. జీఎస్టీ అధికారులమని చెప్పి బంగారం షాపులో యజమానికి నమ్మబలికారు. వ్యాపారి ఎటూ కదలకుండా చేతులకు బేడీలు వేశారు. షాపును తనిఖీ చేశారు. 750 గ్రాముల బంగారానికి సరైన రికార్డులు లేవంటునే, వాటిని బ్యాగులో సర్దారు. ఆఫీసుకు వచ్చి సరైన ధ్రువపత్రాలు ఇచ్చి బంగారాన్ని తీసుకువెళ్లాలని సూచించారు. ఆ తర్వాత వారు కారులో పరారయ్యారు. వివరాల్లోకి వెళితే.. పలాస -కాశీబుగ్గ పట్టణంలోని అత్యంత రద్దీగా ఉండే భగవతి థియేటర్ రోడ్డులోని నిత్యానందనగర్ శ్రీ వెంకటేశ్వర జ్యాయలర్స్‌లో మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కారులో నలుగురు వచ్చారు. తాము జీఎస్టీ అధికారులమంటూ శ్రీ వెంకటేశ్వర జ్యువెలర్స్ యజమాని కిల్లంశెట్టి రామకృష్ణకు పరిచయం చేసుకున్నారు. షాపులో తనిఖీలు చేయాలంటూ యజమాని రామకృష్ణ తెలియజేశారు. ఆయనకు బేడీలు వేశారు. బంగారం స్టాక్ తనిఖీ చేయాలన్నారు. షాపులో బంగారాన్ని సీజ్ చేస్తున్నామని, వారి వెంట తెచ్చుకున్న బ్యాగులో నగలను సర్దుకున్నారు. షాపు వెనుక భాగంలో ఉన్న గదిలో రామకృష్ణను ఉంచి బయట నుంచి గడియపెట్టారు. చేతులకు బేడీలు వేసేయడం, గదిలో పెట్టి గడియ వేయడంతో ఏం జరుగుతుందో అర్ధమయ్యే లోపు బ్యాగులో సర్దుకున్న బంగారం అభరణాలతో కారులో మాయమైపోయారు. జీఎస్టీ అధికారులమంటూ వచ్చినవారు దొంగలని, గుర్తించిన రామకృష్ణ కేకలు వేయడంతో చుట్టు పక్కలవారు వచ్చి గదిలో బేడీలతో ఉన్న రామకృష్ణను తలుపులు తీసి బయటకు తీసుకువచ్చారు. చోరీ జరిగిందని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దుండగులు సుమారు 750 గ్రాముల బంగారం దోచుకెళ్లినట్టు పాప్ యజమాని రామకృష్ణ చెబుతున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. చోరీ జరిగిన షాపులో సీసీ కెమెరాలను, భగవతి థియేటర్ రోడ్డులో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. దొంగలు వచ్చి వెళ్లిన మార్గాలను గుర్తించిన పోలీసులు సరిహద్దుల్లో ఉన్న చెక్‌పోస్టులను అప్రమత్తం చేశారు. అధికారులమంటూ బురిడీ కొట్టించి బంగారం దోచుకువెళ్లిన ఘటనపై వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోపిడీ జరిగిన సమయంలో యజమాని రామకృష్ణ ఒక్కరే షాపులో ఉన్నట్టు తెలుస్తుంది. సిబ్బంది ఎవరూ లేని సమయం చూసి దొంగలు చోరీకి పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు అప్రమత్తమై బృందాలుగా ఏర్పడి అనుమానితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# బడుగుల బతుకులపై పిడుగు

* పిడుగులు పడి మూడు రోజుల్లో ముగ్గురి మృతి * కన్నీరుమున్నీరవుతున్న కుటుంబీకులు * వాన కురిస్తే బయటకు వెళ్లేందుకు భయపడుతున్న జిల్లావాసులు







మందస, ఏప్రిల్ 7(వార్త): ప్రకృతి పగబట్టింది.. పొట్ట చేతపట్టుకుని బతికే కుటుంబాలపై ప్రకోపించింది.. ఎండైన, వానైన.. రాత్రైన, పగలైనా.. బతుకుబండిని లాగుకుని బతికే బడుగు జీవుల బతుకుల్లో విషాదం నింపింది. కష్టమే జీవనాధారంగా బతుకున్న వ్యవసాయ కూలీలను పొట్టన పెట్టుకుంది.. కుటుంబ పెద్దలపై ఆధారపడి బతుకుతున్న ఆయా కుటుంబాలకు విధి తీరని ద్రోహం చేసింది.. పిడుగులరూపంలో పెద్దలను, పిల్లలను బలి తీసుకుంది. దీంతో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మందస మండలంలోని ఉద్దానంలో గల పెద్దకేశుపురం గ్రామానికి చెందిన మడియా కృష్ణవేణి, ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాసిన యోగేశ్వరి తోట పనులకు వెళ్లారు. జీడి పిక్కలను ఏరడంతో పాటు పశువులశాలలో ఉన్న పశువులకు తౌడు, తాగునీరు పెట్టడానికి వెళ్లి పిడుగుకాటుకు బలయ్యారు. తండ్రి, తల్లి, సోదరి మృతి చెందడంతో పెద్ద కుమార్తె నిఖిత అనాథగా మారింది. ఈ సంఘటన మరువక ముందే ఇదే మండలంలోని పితాతొళి పంచాయతీ పుచ్చపాడు గ్రామానికి చెందిన శిస్టు భీమారావు అనే పేద రైతును కూడా పిడుగులు బలి తీసుకున్నాయి. సాయంత్రం పొలం పనులకు వెళ్లాడు. భీమారావు పొలం పనులు అనంతరం కాళ్లు, చేతులు కడుగుకోవడానికి సునాముది కాలువ వద్దకు వెళ్లాడు. సరిగ్గా ఇదే సమయంలో పెద్ద శబ్ధంతో పిడుగు పడింది. పిడుగుపాటుకు ఆయన కాలువలోనే పడిపోయి మృతి చెందాడు. భీమారావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వీరిది కూడా సామాన్య, పేద రైతు కుటుంబం. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న భీమారావు పిడుగు పాటుకు గురవ్వడంతో ఆ కుటుంబం రోదనను ఎవరూ ఆపలేకపోయారు. మూడు రోజుల వ్యవధిలో ముగ్గురు మందసమండలవాసులు పిడుగుపాటుకు మరణించారు. దీంతో వర్షం పడితే బయటకు వెళ్లేందుకు మండలవాసులు భయాందోళనకు గురవుతున్నారు.


GRAND OPENING

8 ఏప్రిల్ 2026 బుధవారం

24/7 EMERGENCY CARE

DWARAKA HOSPITAL

అందుబాటులో ఉన్న వైద్య విభాగాలు

◆ పీడియాట్రిక్ విభాగం (Pediatric) ◆ కార్డియాలజీ (గుండె వ్యాధులు)
◆ న్యూరో & సైకియాట్రీ (మానసిక ఆరోగ్యం) ◆ అంకాలజీ (క్యాన్సర్ చికిత్స)
◆ ENT (చెవి, ముక్కు, గొంతు) ◆ నెఫ్రాలజీ (కిడ్నీ వ్యాధులు) ◆ డెర్మటాలజీ (చర్మ & జుట్టు)
◆ యూరాలజీ విభాగం (Urology) ◆ గైనకాలజీ విభాగం (Gynaecology)

--: మా సేవలు :--

◆ అవుట్ పేషంట్ (OP) సేవలు ◆ ఇన్ పేషంట్ (IP) సేవలు
అత్యవసర సేవలు (Emergenency Care) ◆ ల్యాబ్ టెస్టులు
◆ మెడికల్ కన్సల్టేషన్స్ ◆ ఆధునిక పరికరాలతో చికిత్స





Sri.Ulala.Balayya.Garu
Mentor
Former Municipal Vice-Chairman

మా లక్ష్యం "ప్రతి రోగికి తక్కువ ఖర్చుతో ఉత్తమ వైద్య సేవలను అందించడం"



Managing Director
Smt. Ulala Bharathi Divya
(B.Tech, D.Pharm, LL.B, LL.M)
Former Municipal Vice-Chairperson



Dr. Ulala Seshu Yadav,
MD (Hom) Physician

Gorjee Street, Ichapuram
Cell : 9993338839, 9771122889

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# కాలపరిమితిలోనే శీతల పానీయాలు అమ్మకాలు జరపాలి

## ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా

మెళియాపుట్టి ఏప్రిల్ 7 (వార్త) : నిర్దేశించిన కాల పరిమితిలోనే శీతల పానీయాల అమ్మకాలు జరపాలని ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా అన్నారు. బుధవారం నాడు మండలంలో మెలియాపుట్టి, చాపర తదితర గ్రామాలలోనున్న శీతల పానీయాల షాపులతో పాటు కిరాణా షాపులను సందర్శించి ఆకాస్మీక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన షాపుల వద్ద పరిశుభ్రత పాటించలేకుంటే అటువంటి వారిపై చర్యలు ఉంటాయన్నారు. అలాగే శీతల పానీయాల సీసాలపై ఉన్న తేదీలను పరిశీలించారు. కాలపరిమితి చెల్లినట్లైతే విక్రయాలు జరపొద్దన్నారు. ఈ సందర్శనలో ఆయనతో పాటు సిబ్బంది తదితరులున్నారు.



## ఘనంగా డాక్టర్ పొన్నాడ రామ్ నరేష్ జన్మదిన వేడుకలు



పలాస, ఏప్రిల్ 7 (వార్త): పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రముఖ వైద్యులు ఆరోగ్య హాస్పిటల్ ఎండి రామ్ నరేష్ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పలాస కాశీబుగ్గ చెందిన ప్రముఖులు ఆస్పత్రికి చేరుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణ వ్యాపారులు, జంట పట్టణవాసులు శుభాకాంక్షలు తెలియజేస్తూ మరిన్ని సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రి దినదిన అభివృద్ధి చెంది రోగులకు వైద్యసేవలు అందించాలని కోరారు. ప్రముఖ విలేకరుల బృందం, సోషల్ మీడియా మద్యమాలలో తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా డాక్టర్ రామ్ నరేష్ కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన అందరికీ కూడా ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు.

## నీటి భద్రత ప్రతి ఒక్కరిది..

### నీటి సంఘం అధ్యక్షులు నిరంజన్



పలాస, ఏప్రిల్ 7 (వార్త): నీటి భద్రత ప్రతి ఒక్కరివని నీటి సంఘం అధ్యక్షులు గొనప నిరంజన్ పేర్కొన్నారు. వజ్రపుకొత్తూరు మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన నీతిభద్రత - నీటిసంఘాల బాధ్యత కార్యక్రమానికి సంబంధించిన మండల స్థాయి అధికార్లు, పంచాయతీకార్యదర్సులు, ఇంజనీరింగ్ సహాయకులు సచివాలయ సిబ్బందితో మంగళవారం ఏర్పాటు చేశారు. సమావేశమునకు ఎంపీడీవో ఎన్ రమేష్ నాయుడు అధ్యక్షత వహించగా సూరాడ మోహనరావు ముఖ్యఅతిథిగా సమావేశం నిర్వహించారు. విశిష్ట అతిథిగా నీటిసంఘాల డీసీ గొనప నిరంజన్ మైనర్ ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారి టీ క్రిష్ణరావు, పంచాయతీ రాజ్ ఏఈ నాగభూషణం, గ్రామీణ నీటిపారుదల ఏఈ సతీష్, ఏవో అనిల్ కుమార్, పిఏసియస్ డైరెక్టర్ రాపాక శాంతమూర్తి, సీనియర్ నాయకులు కంబాల దానేసు, కోనేరు ఆదినారాయణ, సచివాలయ సిబ్బంది వీబీ జైరాంజీ విభాగంలో అధికార్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘన జీవామృతం, విత్తన గుళికలపై అవగాహన



సోంపేట, ఏప్రిల్ 7(వార్త ): పలాసపురం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం పంటకు అవసరమైన ఘనజీవామృతం, విత్తన గుళికల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. నేలలో సూక్ష్మజీవులు ఉత్తేజితం అవ్వటానికి ఘనజీవామృతం దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే నెలలో తేమ శాతం తగ్గినప్పుడు సుమారు 45 రోజుల వరకు చక్కగా పెరిగే మొక్కల కోసం విత్తన గుళికల తయారీని ప్రయోగాత్మకంగా చూపించారు. కార్యక్రమంలో సిబ్బంది తిరుమల స్వాతి శ్రావణి మహేష్ జయలక్ష్మి హైమావతి పాల్గొన్నారు.

## జూనియర్ కళాశాలలో ప్రవేశాలు

ఇచ్ఛాపురం ఏప్రిల్ 7 (వార్త): ప్రభుత్వ బాలిక ల కళాశాల లో ప్రథమ సంవత్సరానికిగాను జనరల్ వృత్తి విద్యా కోర్సుల లో ప్రవేశాలు ప్రారంభం అయ్యాయని ప్రిన్సిపాల్ నవ్య శ్రీ మహంతి చెప్పారు. 10వ తరగతి ఫలితాలు రాకముందే విద్యార్థులు తమ కళాశాలలో చేరుతుండటం శుభపరిణామమన్నారు. ఎం.పిసి, బై.పి.సి., సి.ఈ.సి., హెచ్ ఇ.సి, ఎం.బైపి.సి., తో పాటు వృత్తి విద్యా కోర్చ్ ప్రథమ సంవత్సరం లో ప్రవేశాలు ఉంటాయన్నారు. సీట్లు పరిమితంగా ఉన్నందున మొదట చేరేవారు వచ్చి గ్రూపు లో చేరడానికిఅవకాశముంటుందన్నారు.

## అందరికీ ఆరోగ్యం మన లక్ష్యం

సోంపేట ఏప్రిల్ 7 (వార్త ):అందరికీ ఆరోగ్యం మన లక్ష్యం కావాలని కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భాస్కర్ మహంతి పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, ఆశా దినోత్సవం సందర్భంగా మంగళవారం కొర్లాం పి హెచ్ సి లో వైద్య సిబ్బంది ఆశ వర్కర్లతో ర్యాలీ నిర్వహించి ప్రజారోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో జరిగిన సమావేశంలో వైద్యాధికారి మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ ప్రతి కుటుంబంలోనూ ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధతో విధులు నిర్వహించి మంచి ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు అందరము అంకిత బద్ధులమై పనిచేయాలని సూచించారు. విధులలో నిర్లక్ష్యాన్ని విడనాడి సేవలను మరింత విస్తృతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మణిమాల, సిబ్బంది వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



# అధ్వానంగా కిన్నెరవాడ-తొగిరి రోడ్డు

సారవకోట, ఏప్రిల్ 7 (వార్త): సారవకోట మండలం కిన్నెరవాడ, తొగిరి గ్రామాలను కలుపుతున్న ఆర్ అండ్ బీ రోడ్డు దయనీయ స్థితికి చేరుకోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్ద కాలంగా ఈ రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో శిథిలావస్థలోనే కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో కొంతవరకు పనులు చేపట్టగా, ప్రస్తుత ప్రభుత్వంలో కూడా కొన్ని పనులు చేసినప్పటికీ రోడ్డు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందలేదని తెలిపారు. ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన కిన్నెరవాడ గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి, అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతుంటాయి. అయితే రోడ్డు దుస్థితి కారణంగా భక్తులు, ప్రయాణికులు గ్రామానికి చేరుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల, జిల్లా స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యను పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్డు గుంతలతో నిండిపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి



రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి, కిన్నెరవాడ--తొగిరి గ్రామ ప్రజలకు ఈ ఇబ్బందుల నుంచి విముక్తి కల్పించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

# సమస్యల పరిష్కారం కోరుతూ మే 15న పాదయాత్ర

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల హెచ్చరిక

నరసన్నపేట, ఏప్రిల్ 7 (వార్త): సమగ్ర సర్వ శిక్ష (గాూూ) ఒప్పంద ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మే 15న పాదయాత్ర నిర్వహించనున్నట్లు ఉద్యోగులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం నరసన్నపేట ఎమ్మార్సీ కార్యాలయం ఆవరణలో వాల్ పోస్టర్ను విడుదల చేశారు. ఈ పాదయాత్ర విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ నుంచి ప్రారంభమై లోకేశ్ నివాసం వరకు కొనసాగుతుందని వెల్లడించారు. ఎన్నికల ముందు యువగళం పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు కాలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ఈ పాదయాత్ర ద్వారా తమ డిమాండ్లను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.



## లక్ష్మీపురం పాఠశాలలో ఎంఈఓ పరిశీలన..

### విద్యా, భోజనంపై సూచనలు

సారవకోట, ఏప్రిల్ 7 (వార్త): సారవకోట మండలం లక్ష్మీపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ-2 కోడి భూలక్ష్మి మంగళవారం పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న ఆమె విద్యార్థులకు ఇచ్చే హోంవర్కులు, బోధన విధానం, స్కూల్ నిర్వహణ వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. విద్యాశాఖ ఆదేశాల మేరకు పాఠ్యాంశాల బోధనతో పాటు మధ్యాహ్న భోజనం పథకాన్ని కూడా సమర్థవంతంగా అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల అభ్యాసం, ఆరోగ్యం రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె తెలిపారు.

## దేవాది పాఠశాలలో ఎంఈఓ ఆకస్మిక తనిఖీ..

### బోధన, భోజనంపై సూచనలు

నరసన్నపేట, ఏప్రిల్ 7 (వార్త): దేవాది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ ఉప్పాడ శాంతారావు మంగళవారం ఆకస్మికంగా పరిశీలించారు. పాఠశాలకు వెళ్లిన ఆయన విద్యార్థుల హోంవర్క్‌లను పరిశీలించి తగు సూచనలు అందజేశారు. ఉపాధ్యాయుల బోధన విధానం గురించి అడిగి తెలుసుకుని, విద్యార్థుల్లో మెరుగైన సామర్థ్యాలు పెరిగేలా కృషి చేయాలని సూచించారు. అలాగే మధ్యాహ్న భోజన పథకం అమలును కూడా పరిశీలించారు. వంట ఏజెన్సీ సభ్యులతో మాట్లాడి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యాసం, ఆరోగ్యం రెండింటినీ దృష్టిలో ఉంచుకుని పాఠశాల నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని ఎంఈఓ సూచించారు.



# మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

## ఎంఈఓల ఆదేశం



జలుమూరు, ఏప్రిల్ 7 (వార్త): ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూ ప్రకారం కచ్చితంగా అమలు చేయాలని ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎంవీఆర్ఎస్ ప్రసాదరావు సూచించారు. మంగళవారం జలుమూరు మండలం చల్లవానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించిన వారు, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ మెనూకు విరుద్ధంగా భోజనం అందించరాదని స్పష్టం చేశారు. పాఠశాలలో భోజన నాణ్యత, శుభ్రత, వంట విధానాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా అన్ని నిబంధనలు పాటించాలని ఆదేశించారు.

# నత్తనడకన జలజీవన్ మిషన్ పనులు

## నరసన్నపేటలో కొనసాగుతున్న తాగునీటి సమస్య

నరసన్నపేట, ఏప్రిల్ 7 (వార్త): నరసన్నపేట మండలంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జలజీవన్ మిషన్ పథకం పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. మండలంలో మొత్తం 142 పనులను గుర్తించి ప్రారంభించినప్పటికీ, ఇప్పటివరకు కేవలం 70 పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగతా పనులు నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. నిధుల కొరత కారణంగానే పనులు ఆలస్యమవుతున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. అవసరమైన పైపులు, ఇతర మెటీరియల్‌ను మండలంలోని దేశవానిపేట ప్రాంతంలో వదిలేయడం కూడా పనుల ఆలస్యానికి కారణమవుతోంది. ఈ కారణంగా గ్రామాల్లో తాగునీటి సమస్య పూర్తిగా పరిష్కారం కాలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వేసవికాలంలో నీటి అవసరం పెరిగిన నేపథ్యంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిధులు



విడుదల చేసి పనులను వేగవంతం చేసి, ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## నరసన్నపేటలో వీధి కుక్కల స్వైర విహారం

### ప్రజల్లో భయాందోళన

నరసన్నపేట, ఏప్రిల్ 7 (వార్త): వేసవికాలం ప్రారంభమవడంతో నరసన్నపేట పట్టణంలో వీధి కుక్కల సంచారం విపరీతంగా పెరిగింది. గుంపులుగా తిరుగుతున్న కుక్కలు మహిళలు, చిన్నారుల్లో తీవ్ర భయాందోళనలు కలిగిస్తున్నాయి. ప్రతి రోజు వీధుల్లో సంచరించే ప్రజలు ఎప్పుడైనా కుక్కలు దాడి చేస్తాయో అన్న భయంతో వణుకుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం సమయంలో కుక్కల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ఇటీవల అడవి క్రూర జంతువైన చిరుతపులి కూడా కుక్కల దాడిలో ప్రాణాలు కోల్పోయిన ఘటనలను ఉదాహరణగా చూపుతూ, “అటువంటి పరిస్థితుల్లో మనుషుల ప్రాణాలు ఎంత భద్రంగా ఉంటాయి?” అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని ప్రధాన వీధులు, కాలనీలు, పాఠశాలల పరిసరాల్లో కూడా కుక్కలు ఎక్కువగా తిరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు పాఠశాలకు వెళ్లడానికే భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుని ప్రజలకు భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



## ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం

పలాస, ఏప్రిల్ 7 (వార్త): ఉచిత నేత్ర వైద్య శిబిరం మంగళవారం విజయవంతంగా ముగిసింది. శ్రీ సత్యసాయి సేవాసమితి పలాసలో ప్రభుత్వ సహకారంతో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్స తనిఖీ శిబిరము నిర్వహించారు. ఈ శిబిరంలో రోగులకి 140 మంది తనిఖీకి హాజరు కాగా, వారిలో 90 మంది శాస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. ఈ యొక్క సేవా కార్యక్రమంలో ప్రభుత్వ నేత్ర వైద్యాధికారి వెంకటరమణ , ఫౌండేషన్ సిబ్బంది, సాయి సభ్యులు జాతి నారాయణ సేవ చైర్మన్ వడ్డి రామారావు, పూర్వపు కన్వీనర్ పెంట కౌన్తేయుడు, తర్లానా రమేష్, మల్లా రామేశ్వరం ,కృష్ణ స్వామి, పొట్నూరు కొండలరావు, తర్లనా రాజేష్, పొట్నూరు శ్రీను సేవాదళ్ సభ్యులు తదితరులు పేషెంట్స్ కి మంచినీరు, ఆహారం అందించడమైనది.

## రక్షిత నీటి పథకం పనులు జాప్యం


నరసన్నపేట, ఏప్రిల్ 7 (వార్త): నరసన్నపేట మేజర్ పంచాయతీలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చొరవతో దేశవానిపేటలో రక్షిత మంచినీటి పథకం మంజూరైంది. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ. 68 లక్షల నిధులను కేటాయించింది. సుమారు 1.50 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ పథకం పనులు ఇంకా పూర్తి కాలేదు. పనులు ముందుకు సాగకపోవడంతో స్థానికులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిధుల విడుదలలో ఆలస్యం కావడం వల్లనే పనులు నిలిచిపోయాయని నిర్మాణదారులు పేర్కొంటున్నారు. వేసవికాలంలో నీటి అవసరం పెరిగిన ఈ సమయంలో పథకం పూర్తి కాకపోవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిధులు విడుదల చేసి పనులను వేగవంతం చేసి, ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

# సమయపాలన పాటించని ఉద్యోగులు

సంతబొమ్మాళి :స్థానిక ఎంపిడివో కార్యాలయ ఉద్యోగులు ఎవరికీ వారే యుమునా తీరు చందనా వ్యవరిస్తున్నాయని బహిరంగ విమర్శలు వి నిపిస్తున్నాయి. సిబ్బంది కార్యాలయానికి ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు వెళుతున్నారో తెలియని పరిస్థితి నెలకొనడంతో పనులు కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర. ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు గుండెకాయ లాంటి సంతబొమ్మాళి మండలంలోని ఎంపిడివో కార్యాలయ సిబ్బంది తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి మంగళవారం ఎంపిడివో కార్యాలయానికి ఉదయం 12 గంటలకు వరకు కేవలం కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మిశ్రో తప్ప ఇతర అధికారులు, సిబ్బంది విధులకు హాజరు కాలేదు. ఎంపిడివో జయంత్ ప్రసాద్ , కార్యాలయ ఈవో పార్వతీశం, డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మణరావు, జూనియర్ అసిస్టెంట్ రెడ్డి తో సహా అటెండర్లు కూడా విదులు హాజరు కాలేదు. 10.40



నిమిషాలకు ఓ అటెండర్ విధులు వచ్చాడు. ఎంపిడివో జయంత్ ప్రసాద్12.05 నిమిషాలకు కార్యాలయానికి వచ్చారు. స్థానికంగా ఉంటున్నట్లు నెలవారి వేలాది రుపాయిలు హౌస్ రెంట్ అలెవెన్(హెచ్.ఆర్ఎ.ఏ)లు డ్రా చేస్తున్న స్థానికంగా ఉండక పోవడంతో వారి ఎప్పుడు వస్తున్నారో ఎప్పుడు వెళ్ళుతున్నారో పరిస్థితి నెలకొంది. ఈవో పార్వతీశం ,డిప్యూటీ ఎంపీడీవో లక్ష్మణరావు లు ఫీల్డ్ వర్క్ వెళ్లారని, సెలవులో ఉన్నారని రకరకాలుగా సిబ్బంది సమాధానం చెప్పడం కొసమెరుపు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఎవరికి వారే యమునా తీరు అన్న రీతిగా వ్యవహరిస్తున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి మండల పరిషత్ సిబ్బంది స్థానికంగా ఉండేటట్లు, సకాలంలో విధులకు హాజరయ్యేటట్లు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## భీకర గాలులు... భారీ వర్షం

సోంపేట, ఏప్రిల్ 7(వార్త ): సోంపేట, కంచిలి, కవిటి మండలాల్లో మంగళవారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారి అనూహ్యంగా మారిపోయింది. ఇదివరకు ఎన్నడూ లేని విదంగా భీకరమైన ఈదురు గాలులతో పాటు భారీ వర్షం గంటల పాటు కొరవడంతో ప్రజలు ఆందోళన చెందాల్సి వచ్చింది. సుమా రెండున్నర గంటల నుంచి మొదలైన భారీ వర్షం నాలుగున్నర గంటల వరకు ఎడతెరిపి లేకుండా విపరీతమైన ఈదురుగాలులతో కొరవడంతో ఎక్కడికక్కడ చెట్లు నేలకొరిగాయి. కంచిలి మండలంలో నాత పుట్టుక గ్రామానికి చెందిన రైతు హృషికేష్ దోలాయి కి చెందిన రెండు ఆవులు కొబ్బరి చెట్టు మీద పడడంతో ప్రాణాలు విడిచాయి. వీటి విలువ సుమారు 80 వేల రూపాయలు ఉంటుందని అంచనా. దీంతో రైతు కుటుంబం తీవ్ర ఆవేదనకు గురయ్యింది. పశు వైద్య అధికారిణి శిరీష వెంటనే గ్రామానికి వెళ్లి పరిశీలించారు.ఉద్దానం ప్రాంతంలో జీడీ, మామిడి పంటలకు విపరీతంగా నష్టం వాటిల్లింది. ఎక్కడ చూసినా చెట్ల కొమ్మలు విపరీతంగా విరిగి పడ్డాయి.

అరటి పంటకు కూడా అధిక నష్టం వాటిల్లింది.సోంపేట పట్టణం లోను చెట్లు విరిగిపడ్డాయి. వీదులోనూ, మెయిన్ రోడ్డు పైన చెట్లు నెలకొరగడంతో ప్రజలు కొంతసమయం ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సోంపేట పట్టణం లో మురికి నీటితో పలు వీదులు నిండిపోయాయి.అన్నిచోట్లా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉద్దానంతో పాటు పట్టణాల్లోను అంధకారం నెలకొంది.



## హెచ్ఐవిపై అవగాహన అవసరం

ఇచ్ఛాపురం ,ఏప్రిల్ 7 (వార్త):హెచ్ ఐ వి పట్ల అవగాహన అవసరమని వైద్యులు సూచించారు. హెచ్ ఐ వి పై అవగాహన సమావేశం ఈదుపురం పీహెచ్‌సీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జరిగింది.ఇందులో సుఖ వ్యాధులు ఎలా వ్యాపిస్తాయి,అవి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు వివరిం చారు. డాక్టర్ సంతోష్, రమ్య శ్రీనివాస్, గోవిందమ్మా, రవికుమార్, కౌన్సెలర్ రాజశేఖర్, ఆశాలు పాల్గొన్నారు.



## అమరావతి ఏకైక, శాశ్వత రాజధాని

పలాస, ఏప్రిల్ 7 (వార్త): ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ఏకైక, శాశ్వత రాజధానిగా నిర్ణయించినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ధన్యవాదములు తెలుపుతూ, ఈ నిర్ణయం కోసం కృషి చేసిన చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని పార్లమెంటు టిడిపి ఉపాధ్యక్షుడు గాలి కృష్ణ కొనియాడారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమరావతి అందరికీ అందుబాటులో ఉండే రాజధాని అని, గతంలో చంద్రబాబు నాయుడు పుణ్యనదుల నుండి మట్టి, నీరు తెచ్చి పునాది వేయడం ద్వారా దీనికి బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం, కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం కలిసి పనిచేయడం (డబుల్ ఇంజిన్ సర్కార్) వల్ల రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో వైఎస్ఆర్‌సీపీ పాలనను ఆయన విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రవర్తన, భాషపై అసహనం వ్యక్తం చేస్తూ, ప్రజలు మార్పును కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉజ్వల భవిష్యత్తు కోసం, రాబోయే తరాల కోసం ప్రజలందరూ కూటమి ప్రభుత్వానికి అండగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అమరావతిని ప్రపంచ పటంలో నిలబెట్టాలన్న చంద్రబాబు నాయుడు కలకు కేంద్రం మద్దతు పలకడం ఆరు కోట్ల ఆంధ్రుల విజయంగా ఆయన అభివర్ణించారు. ఢిల్లీలో జరగబోయే కేంద్ర క్యాబినెట్ సమావేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు ఆమోదం తెలిపే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఇది మహిళలకు రాజకీయాల్లో గొప్ప అవకాశమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సవరణల వల్ల లోక్‌సభ స్థానాల సంఖ్య ప్రస్తుతం ఉన్న 543 నుండి 816కి పెరిగే అవకాశం ఉందని, తద్వారా మహిళలకు 273 సీట్లు దక్కే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. దేశాభివృద్ధికి నరేంద్ర మోదీ ప్రధానిగా ఉండటం అవసరమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండాలని ఆకాంక్షించారు. స్థానికంగా పలాస నియోజకవర్గంలో శిరీషమ్మ నాయకత్వాన్ని అందరూ బలపరచాలని కోరారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ సమర్థవంతమైన నాయకత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని, పార్టీలకు అతీతంగా అందరూ ఈ నిర్ణయాలను స్వాగతించాలని ఆయన పిలుపునిచ్చారు.



## కొండలోగాంలో ఉచిత వైద్య శిబిరం

మందస, ఏప్రిల్ 7(వార్త): మందస గిరిజన గ్రామమైన కొండలోగాం పీపుల్స్ హెల్త్ సొసైటీ, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. శిబిరంలో శ్రీకాకుళం కిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ చందు, వైద్య బృందం వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరం ప్రారంభ సభలో డాక్టర్ చందు మాట్లాడుతూ ప్రజలకు వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు కిమ్స్ ఇటువంటి సేవలు చేపడుతున్నదని, వీటిని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. డాక్టర్ మట్ట ఖగేశ్వరరావు మాట్లాడుతూ మండల కేంద్రానికి దూరంగా ఉన్న ఇటువంటి గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఇలాంటి వైద్య శిబిరాలు దోహదపడతాయన్నారు. గ్రీన్ ఆర్మీ ఫౌండేషన్ నాయకుడు బి.గోపాల్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు పర్యావరణం కాపాడుతూ, మెడికల్ క్యాంపులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఎస్.ఈశ్వరరావు మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా రక్త దానం చేస్తూ అనేకమంది ప్రాణాలు కాపాడు తున్నామన్నారు. ప్రజలు కూడా తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఈ మెడికల్ క్యాంపులు కూడా దోహద పడతాయని తెలిపారు. ఎస్వీ డెంటల్ ఆసుపత్రి డాక్టర్ డాక్టర్ బి.క్రాంతి కుమార్ డెంటల్ సమస్యలపై వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో గిరిజనులు పాల్గొని, వైద్య సేవలు పొందారు. సీఐటీయూ నాయకుడు ఎన్.గణపతి, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సవర పాల్గుణరావు, సవర భాస్కరరావు, నాగేశ్వరరావు, ప్రశాంత్, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, కిమ్స్ సిబ్బంది నర్సింగ్ రాంబాబు, ఎకో టెక్నిషియన్ రాధ, ఈసీజీ కృష్ణమూర్తి, లాబ్ టెక్నీషియన్ సిద్ధూ, ఫార్మసీ సిబ్బంది గౌరి శంకర్, పీఆర్ఓ శ్యామ్ పాల్గొన్నారు.




### 'మార్పు'నకు ఏయూ
## శతాబ్ది సాహితీలో అవకాశం
### కవిగా జగన్మోహనరావుకు ఘన సన్మానం

మందస, ఏప్రిల్ 7(వార్త): ప్రముఖ కవి మార్పు జగన్మోహనరావుకు అరుదైన గౌరవం దక్కింది. ఆయన రచనలు, కవిత్వం, పద్యాలు ఎంతగానో ప్రాచుర్యం పొందుతున్నాయి. తాజాగా విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వకళాపరిషత్తులోని ఆయనకు ఘనంగా సన్మానం జరిగింది. ఆంధ్ర విశ్వకళాపరిషత్తు శతాబ్దిసాహితీ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన విశ్వవిద్యాలయ స్థాయి కవిసమ్మేళనంలో మార్పునకు పాల్గొనే అవకాశం దక్కింది. ఇదే వేదికపై ఆయన రచించిన కవితలు వినిపించారు. అనంతరం జగన్మోహనరావును అభినందిస్తూ, ప్రశంసాపత్రాన్ని, మెమెమంటో అందజేశారు. ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్, తెలుగు శాఖాధ్యక్షుడు జర్రా అప్పారావు ఆయనకు శాలువా, మెమొంటోతో సత్కరించారు. ఆంధ్రా విశ్వ విద్యాలయంలో పరిశోధక విద్యార్థిగా చేరి, మొట్టమొదటిగా అందుకున్న సన్మానం, ప్రశంసాపత్రాన్ని అందుకున్న మార్పు జగన్మోహనరావుకు గ్రామస్థులు, బంధుమిత్రులు, స్నేహితులు, శ్రేయోభిలాసులు అభినందనలు తెలిపారు.



### తారు రోడ్డు అనుకుంటే
## బురదలో కాలేసినట్లే!

సోంపేట ఏప్రిల్ 7 (వార్త ): పై దృశ్యాన్ని చూస్తుంటే ఒక వీధిలో నిర్మించిన తారు రోడ్డు మాదిరిగా స్పష్టంగా కనిపిస్తోంది. నిజంగా అది తారు రోడ్డు అనుకుంటే బురదలో కాలేసినట్టే. మంగళవారం మధ్యాహ్నం భారీ ఈదురుగాలులతో కురిసిన విపరీతమైన వర్షానికి పట్టణంలోని మురికి కాలువలలో బురద నీరు వీధుల మధ్యకు వచ్చి చేర డంతో ఆ బురదంత ఇలా తారు రోడ్డు మాదిరిగా కనిపిస్తోంది. సోంపేట పట్టణంలోని రాజు గారి పేటలో ఆవిష్కృతమైన ఈ తారు రోడ్డు దృశ్యం అక్కడి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఒకవైపు దుర్గంధం మరోవైపు చెత్తాచెదారాలతో కూడిన బురద వీధి మధ్యలో ఇలా పేరుకుపోవడంతో వారు పడిన బాధ ఇంత అంతా కాదు. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వలన భారీ వర్షాలు కురిసే సమయంలో ఈ దుస్థితి తప్పడం లేదని రాజుగారి పేట వీధి ప్రజలు వాపోతున్నారు.



# గొప్పలకు పోవద్దు.. తిప్పలు పడొద్దు..

### ప్రభుత్వ బడుల్లో చేర్పించాలంటూ వినూత్న ప్రచారం

పలాస, ఏప్రిల్ 7 (వార్త): ప్రభుత్వ పాఠశాలను వదిలి డబ్బులు పెట్టి బయటకు వెళ్లాలనుకునే తల్లిదండ్రులు, విద్యార్థులు ఒకసారి ఆలోచించండి లేనిపోని గొప్పలకు పోయి తిప్పలు పడొద్దు అంటూ వినూత్నంగా.. మంగళవారం వజ్రపుకొత్తూరు మండలం లోని, నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కొత్త అడ్మిషన్లు కోసంవినూత్నంగా ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని లక్ష్మిదేవి పేట, కాశీ నగర్, వజ్రపుకొత్తూరు, కిడిసింగి ప్రాథమిక పాఠశాలకు వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు. ఆధునిక సాంకేతిక ఐఎఫ్పి ప్యానల్ తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాల, విశాలమైన క్రీడా మైదానం, ఆంగ్ల మాధ్యమం విద్యతో పాటు ఉచితంగా యూనిఫామ్, బెల్ట్ , షూ, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీ, పోషకాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం ప్రభుత్వం అందిస్తూ నాణ్యమైన బోధన అందించే సుశిక్షితులైన ఉపాధ్యాయులు కేవలం ప్రభుత్వ పాఠశాలకు మాత్రమే సాధ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.హేమారావు, విద్యాకమిటీ చైర్మన్ బి. లక్ష్మిపతి, ఉపాధ్యాయ సిబ్బంది పి. సోమేశ్వరరావు, కొయ్యల శ్రీనివాసరావు, మంగరాజు, గజేంద్ర, నారాయణ పాల్గొన్నారు.



# శ్రీకాకుళం

## విద్యార్థులు లేని పాఠశాల..



నరసన్నపేట, ఏప్రిల్ 7 (వార్త): విద్యాశాఖ ఆధ్వర్యంలో "మన ఊరి బడిని కాపాడుకుందాం" కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ, నరసన్నపేటలో ఒక పాఠశాల మాత్రం విద్యార్థులు లేక మూలకు చేరిన పరిస్థితి నెలకొంది. నరసన్నపేట నడిబొడ్డున ప్రధాన రహదారికి ఆనుకుని, పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల గత రెండేళ్లుగా విద్యార్థులు లేక ఖాళీగా ఉంది. పట్టణ ప్రాంతంలో ఉండి కూడా ఈ పరిస్థితి ఏర్పడటం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. విద్యార్థుల చేరిక కోసం తగిన చర్యలు తీసుకోకపోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాల్సిన సమయంలో ఈ విధంగా నిర్లక్ష్యం చేయడం శోచనీయమని అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థుల చేరికకు ప్రత్యేక చర్యలు తీసుకుని, పాఠశాలను మళ్లీ కార్యకలాపాల్లోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



జలుమూరు, ఏప్రిల్ 7 (వార్త): జలుమూరు మండలంలోని కస్తూరిబా గురుకుల పాఠశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ యశోద మాట్లాడుతూ, విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేలా అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత, సరైన ఆహారం, వ్యాయామం వంటి ఆరోగ్య సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా వ్యాధులను దూరంగా ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పిడుగు పాటుకు తల్లీ, కుమార్తె మరణం దురదృష్టకరం

### మాజీమంత్రి గౌతు శ్యామసుందరశివాజీ



మందస, ఏప్రిల్ 7(వార్త): పిడుగుపాటుకు సంఘటనలో తల్లీ, కుమార్తె మరణం దురదృష్టకరమని మాజీమంత్రి గౌతు శ్యామసుందర శివాజీ అన్నారు. మందస మండలంలోని నారాయణపురం పంచాయతీ పెద్దకేశుపురం గ్రామానికి చెందిన మడియా క్రిష్ణవేణి, ఆమె కుమార్తె యోగేశ్వరి పిడుగు పడి అకాల మరణం చెందారు. విషయం తెలుసుకుని, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర్ శివాజీ బాధిత కుటుంబీకులను కలిసి, పరామర్శించారు. విధి విచిత్రమైనదని, తల్లీ, కుమార్తెలు పిడుగు పాటుకు గురై మరణించడం తనను కలచివేసింద న్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రి కె.అచ్చెన్నాయుడు ఇప్పటికే పరిహారం ప్రకటించారని తెలిపారు. అనంతరం చిన్నబహడపల్లి, లొహరిబందకొత్తూరు గ్రామాల్లో పర్యటించి, పలు కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, మండల కార్యదర్శి సాలిన మాధవరావు, దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, బమ్మిడి కర్రయ్య, నవీన్ యాదవ్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## యుద్ధం వద్దు..శాంతి ముద్దు..


### గ్యాస్ ,పెట్రోల్ ,డీజల్ ధరలు తగ్గించాలి

పలాస, ఏప్రిల్ 7 (వార్త): యుద్ధం వద్దని, శాంతి ముద్దని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గ్యాస్ ,పెట్రోల్ ,డీజల్ ధరలు తగ్గించాలని మంగళవారం పలాస తహశీల్దార్ కార్యలయం ఎదుట సిపిఐ యంయల్ లిబరేషన్ పార్టీ అధ్వర్యంలో పార్టీ ప్రజాసంఘాల సమన్వయంతో ధర్నా నిర్వహించి డిప్యూటీ తహశీల్దార్ గిరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వక్తులు మాట్లాడుతూ యుద్ధం వల్ల ప్రాణ నష్టం, ఆస్తి నష్టం తో చిన్న చిన్న దేశాలు సంక్షోభంలో కూరికి పోయాయని మండిపడ్డారు. అత్యధికంగా కార్మిక రంగం సంక్షేబంలో కూరకుపోయిందన్నారు. గ్యాస్ , పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగి పోయి, నిత్యరసర వస్తువుల దరలుతో భారత ప్రభుత్వం పూర్తిస్థాయి సంక్షోబంలో కూరుకుపోయిం దని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు సుపరి పాలన అందించ డంలో విఫలమైందన్నారు. పెద్ద పెద్ద పట్టణాలలో గ్యాస్ అందక హెటల్లు మూసివేసిన పరిస్తితులను ఎదుర్కొన్నామని తెలిపారు. అకాల వర్షాలతో నష్టపోయిన జీడి రైతాంగాన్నికి ప్రత్యేకప్యాకేజ్ ప్రకటించాలిని, వంశదార ప్రాజెక్ట్ నుండి సాగు నీరు,త్రాగు నీరు ఇచ్చాపురం వరకు పొడిగించాలిని డిమాండ్ చేశారు. కార్మికులకు అందుబాటులో లేని, 4 లేబర్ కోడ్లను రద్దుచేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, రాష్ట్రకమిటీ సభ్యులు మద్దిల రామారావు, ఎఐసిసిటియు జిల్లా నాయకులు కుత్తుం దుష్యంత్, రైతుసంఘం జిల్లా నాయకులు పోతనపల్లి అప్పారావు, ఎఐసిసిటియు పలాస పట్టణ నాయకులు పిన్నింటి నాగేశ్వరరావు, కుత్తుం లోకనాదం, మామిడి వెంకటరావు, మద్దిల రాజారావు, గేదెల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



# 15 లోగా 'విద్యాంజలి'లో అప్లోడ్ చేయాలి

**శ్రీకాకుళం, ఏప్రిల్ 7 (వార్త):** జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రధానోపాధ్యాయులు గుర్తించి విద్యాంజలి ( Portal: https://vidyanjali. education.gov.in/)పోర్టల్లో ఈ నెల 15వ తేదీలోగా అప్లోడ్ చేయాలని డీఈఓ ఎ.రవిబాబు, సమగ్రశిక్ష ఏపీసీ పి. వేణుగోపాలరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాంజలి పథకం ద్వారా ఎన్.ఆర్.ఐ.లు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో పాఠశాలలను అభివృద్ధి చేయాలని సంకల్పించినట్లుగా తెలిపారు. దాతలు నేరుగా ఈ పోర్టల్ ద్వారా పాఠశాలలను ఎంచుకుని స్వచ్ఛంద సహకారం అందించవచ్చన్నారు. పోర్టల్ ద్వారా నగదు రూపంలో విరాళాలు సేకరించరని, కేవలం వస్తువులు, సేవల రూపంలో మాత్రమే సహకారాన్ని కోరుతున్నట్లుగా వారు తెలిపారు. పాఠశాలల అభివృద్ధికి సహకారం అందించాలనుకునే వారు పోర్టల్ ను సందర్శించి వలంటీరుగా పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. విద్యాంజలి పథకం ద్వారా గదుల నిర్మాణం, మరమ్మతులు, ఫర్నీచర్, విద్యాసామగ్రి, తదితరాలు అందించేందుకు దాతలు ముందుకురావాలని ఈ ప్రకటన ద్వారా వారు కోరారు.



## సీఎంఆర్ఎఫ్ కొండంత భరోసా

**ఆమదాలవలస, ఏప్రిల్ 7 (వార్త):** అమదాలవలస నియోజకవర్గంలోని బూర్జ, సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాలకు సంబంధించిన గ్రామాలలో ఇటీవల కాలంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలకు వైద్య ఖర్చులు నిమిత్తం చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయంగా వారి కుటుంబాలకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులను పంపిణీ చేశారు. ఈ చెక్కులను ఆమదాలవలస శాసనసభ్యులు కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ కూన ప్రమీలా లబ్ధిదారుల కుటుంబాల ఇంటికి వెళ్లి అందజేశారు. వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. మెట్టెక్కివలసకు చెందిన పొట్నూరు శ్రీనివాసరావు, దన్నానపేటకు చెందిన గొర్ల మహేశ్వరరావు, చిన్నజొన్నవలసకు చెందిన రెడ్డి అప్పల నరసమ్మ, కలివరం గ్రామానికి చెందిన పొట్నూరు శివ సాయి, బప్పడాంనకు చెందిన కూటికుప్పల మౌనిక, అన్నంపేటకు చెందిన సైలాడ మణికంట, సింధువాడకు చెందిన కొన్ని ఎర్రయ్యకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దళిత, పీడిత కులాల ఆత్మగౌరవ
## పోరాట దినాలను పాటిద్దాం

**కేఎన్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య**



**మందస, ఏప్రిల్ 7(వార్త):** కులనిర్మూలనా పోరాట సమితి(కేఎన్ పీఎస్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పూలే పుట్టినరోజు సందర్భంగా ఈనెల 11నుండి 14 వరకు దళిత,పీడిత కులాల ఆత్మగౌరవ పోరాట దినాలుగా పాటిద్దాం అనే కార్యక్రమం మందస మండల కేంద్రంలో అంబేద్కర్ భవనం విగ్రహం వద్ద జరిగింది. ఈ సందర్భంగా కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమం చేశారు. అనంతరం కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య మాట్లాడుతూ దళితులు మతం మారినా కులం పోదని, వందల ఏళ్లుగా వారిపై కులపరమైన దాడులు, దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నాయి. అనే విషయాన్ని ఏమాత్రం పరిగణలోకి తీసుకోని దేశ అత్యున్నత న్యాయ స్థానం దళితులు మతం మారితే ఎస్సీ రిజర్వేషన్ కోల్పోతారని తీర్పు చెప్పడం దళిత వ్యతిరేక తీర్పు అని అన్నారు. కనీసం సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చే న్యాయవాదులు కారంచేడు, చుండూరు దళిత బాధితులు దళిత క్రైస్తవులు కానీ అత్యంత పాశవీకంగా హత్య చేశారని, దళితులు మతం మారిన వారిపైన దాడులు కొనసాగుతాయనే స్పృహ కోల్పోయిన తీర్పులు వల్ల దళితులు ఎన్నో ఉద్యమాలు ఫలితంగా సాధించుకొన్న ఎస్సీ, ఎస్టీ హత్యాచార నిరోధక చట్టాన్ని తూట్లుపొడిచే తీర్పు అని అన్నారు. సామ్రాజ్యవాదంతో ప్రభుత్వ సంస్థలు ప్రయివేట్ పరం చేసి ఉన్న రిజర్వేషన్స్ లేకుండా చేసి అంబేద్కర్, పూలే కలలకు వ్యతిరేకంగా ప్రస్తుతం పాలకులు సంఘీపరివార్ శక్తులు కనుసన్నల్లో పాలన చేస్తూ రాజ్యాంగం వ్యతిరేకంగా పాలన సాగుతుందన్నారు. రాజ్యాంగాన్ని రక్షించుకోవడశీ కోసం దళిత, పీడిత కులాలు ప్రగతిశీల శక్తులతో ఐక్యంగా ఉద్యమించి రాజ్యాంగాన్ని రక్షించుకోవడమే పూలే అంబేద్కర్ లకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ సంఘం నాయకులు కొత్తపల్లి మోహనరావు, సంకకాళిదాసు, బడియా వల్లభరావు, ఇప్పిలిచంద్రశేఖర్, పిలకశ్రీనివాసరావు, సురలక్ష్మి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాతలే నిజమైన హీరోలు

**శ్రీకాకుళం, ఏప్రిల్7 (వార్త):** రక్తదాతలే నిజమైన హీరోలని అఖిలభారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను అన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారి విలువైన ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున పుట్టిన రోజును పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాలలో భాగంగా అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆద్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని శ్రీ కళ్యాణ మండపంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని తైక్వాండో శ్రీను సీనియర్ జర్నలిస్ట్ సుధీర్ వర్మ , దళిత సంఘాల జెఏసి నేత డా. కంఠ వేణు,చిరంజీవి యువత ఉత్తరాంధ్ర కార్యదర్శి వైశ్యరాజు మోహన్ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన అల్లు అర్జున్ అభిమానులను వారు అభినందించారు. వారి సేవలను కొనియాడారు. శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ ఆద్వర్యంలో సిబ్బంది రక్తదాతల నుంచి రక్తాన్ని సేకరించారు. అభిమానులను ఉద్దేశించి తైక్వాండో శ్రీను మాట్లాడుతూ అల్లు అర్జున్ పుట్టిన రోజు సందర్భంగా సామాజిక సేవ కార్యక్రమాల నిర్వహణలో భాగంగా రక్తదానం చేయడానికి అభిమానులు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు. వేసవి కాలంలో రక్త నిల్వలు రక్తనిధి కేంద్రాలలో తక్కువగా ఉంటాయని అటువంటి పరిస్థితుల్లో అల్లు అర్జున్ ఫ్యాన్స్ రక్తదానం చేయడం వల్ల ఆ రక్తం ఎంతో మందికి ఉపయోగపడుతుందన్నారు. మెగా ఫ్యామిలీ తరపున అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తైక్వాండో నవీన్ ను అభినందించారు. అలాగే జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. రమణారెడ్డి ఇతర ముఖ్యనాయకులను, శ్రీకాకుళం నగర అధ్యక్షుడు కెల్ల గిరి అండ్ టీం సభ్యులను దుశ్శాలువలతో సత్కరించి జ్ఞాపికలను అందజేసారు. శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంకు మేనేజర్ మణికంఠకి చిరు సత్కారం చేసారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యతగా ఈవెంట్ ఆర్గనైజర్ సాయిరాం వ్యవహరించారు. కార్యక్రమాలలో అల్లు అర్జున్ ఫ్యాన్స్ జిల్లా అసోసియేషన్ నాయకులు జి.భాను ప్రసాద్ ,వై.వెంకటేశ్వరరావు, ఎం.సాయికుమార్ దాస్, పి.తేజేశ్వరరావు,ఉంకి సుధీర్ ,నెల్లి సురేష్ ,డి.భాస్కర్ రావు,సిహెచ్ .మోహన్ రావు, బి.హేమ సుందర్ లతో పాటు శ్రీకాకుళం టౌన్ అసోసియేషన్ ప్రతినిధులు పవన్, సాగర్ తదితరులతో పాటు మెగా ఫ్యామిలీ అభిమానులు రామ్ చరణ్ యువత అధ్యక్షుడు తైక్వాండో గౌతం , పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ గొర్లె కిరణ్ ,పెయ్యల చంటి, సాయిధరమ్ తేజ్ యువత అధ్యక్షుడు జోగిపాటి వంశీ,వరుణ్ తేజ్ అభిమాన సంఘం అధ్యక్షుడు సీర రుద్ర రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఆరోగ్యమే నిజమైన సంపద

*** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. అనిత**
*** ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు**

**శ్రీకాకుళం, ఏప్రిల్ 7 (వార్త):** ఆరోగ్యమే నిజమైన సంపదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. అనిత తెలిపారు. మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా విజ్ఞానానికి అండగా నిలుద్దాం - ఆరోగ్యం కోసం కలిసి పనిచేద్దాం అనే నినాదంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి స్థానిక ఏడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యం పై శ్రద్ధ పెట్టాలని, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరుచుకొంటే ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందుతారని, ఆ ఆరోగ్యమే నిజమైన సంపదన్నారు. ప్రతీ ఒక్కరూ క్రమంతప్పకుండా వ్యాయమం చేయాలని, పౌష్టికాహారం తీసుకొని వ్యక్తిగత, పరిశరాల పరిశుభ్రత పాటించాలని, ఆరోగ్యకర జీవన విధానం అలవరుచుకొనుట వలన ఆనందకరమైన జీవనం సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఐ.ఓ డా. రామ్ దాస్, డిప్యూటీ డి.ఎమ్.హెచ్.ఓ డా. మేరీ కేథరిన్, ఆర్.బి.ఎస్.కె. ప్రొగ్రామ్ అధికారి డా. శివరంజిని, డిప్యూటీ డెమో కె. యర్రన్న, డిప్యూటీ హెచ్.ఇ.ఓ ఎస్.విజయలక్ష్మి, పి. మోహిని రత్నకుమారి, కార్యాలయ సిబ్బంది, ఎ.ఎన్.ఎమ్, ఆశా వర్కర్లు, కార్యాలయ సిబ్బంది, రెడ్ క్రాస్ సభ్యులు, చైతన్య, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.




### శుభ్రతతో ఆరోగ్యకర సమాజం




ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెడ్ క్రాస్ పరిపాలన భవనం నుండి ఏడు రోడ్లు కూడలి వరకు ఈ ర్యాలీ సాగింది. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హనుమంతు కూర్మారావు ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజమంతా ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత, సామాజిక పరిశుభ్రత అవసరమన్నారు. జీవన శైలిలో మార్పు వలన ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవచ్చన్నారు. రెడ్ క్రాస్ చైర్మన్ పి జగన్మోహన్రావు మాట్లాడుతూ జూనియర్, యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్ల ద్వారా ఆరోగ్యము, సామాజిక బాధ్యత అనే అంశాలపై ప్రజ చైతన్య కార్యక్రమాలు కలిగిస్తున్నామని, ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ ఎంతో మందికి ఆరోగ్యాన్ని మెరుగుపరు చుకుని అవకాశం కల్పిస్తున్నామన్నారు. రెడ్ క్రాస్ కార్యదర్శి మల్లే శ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు కూడా సామాజిక బాధ్యతగా ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి సరైన ఆహార అలవాట్లు అవలంబించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు పి శ్రీకాంత్, ఎం కళ్యాణ్ చక్రవర్తి, బి చిన్మయిరావ్, కే సత్యనారాయణ, పి చైతన్యకుమార్, జి రమణ యూత్ రెడ్ క్రాస్ వాలంటీర్లు స్వచ్ఛంద సేవకులు తదితరులు పాల్గొన్నారు.

### సంపూర్ణ ఆరోగ్యానికి సరైన వేదికలు నడక సంఘాలు..

ఆరోగ్యమే మహభాగ్యం అనే సూక్తిని ఆచరణలో అమలు చేస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు వేస్తున్నాయని శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హనుమంతు కూర్మారావు అన్నారు.. మంగళవారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్, సావుకారి అన్నపూర్ణమ్మ చారటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హనుమంతు కూర్మారావు మాట్లాడుతూ.. ప్రజారోగ్య సమస్యలపై ప్రతీ ఒక్కరికీ అవగాహన ఉండాలన్నారు. శ్రీకాకుళం నగర అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు. ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామని .. నగరంలో చక్కని మాస్టర్ ప్లాన్ తయారుచేసి ప్రణాళికా బద్ధంగా నగరాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు.. ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ థీమ్ "ఆరోగ్యం కోసం అందరం.. సైన్సు కు తోడుగా నిలుద్దాం.." అనే అంశంతో ప్రపంచ వ్యాప్తంగా వరల్డ్ హెల్త్ డే వేడుకలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని నిర్మించడానికి ప్రజలను, ప్రభుత్వాలను ఏకతాటిపైకి తీసుకురావడమే ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యమన్నారు. మానవాళికి సంబంధించిన ముఖ్యమైన ప్రపంచ ఆరోగ్య సమస్యల వైపు ప్రపంచ దృష్టిని ఆకర్షించడమే ప్రపంచ ఆరోగ్య దినోత్సవము యొక్క ప్రధాన లక్ష్యమని కమిషనర్ స్పష్టం చేశారు. వ్యక్తిగత ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. నడక సంఘాలు సామాజిక హితాన్ని కోరే కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టడం అభినందనీయమన్నారు. శ్రీకాకుళం నగర అభివృద్ధికి వాకర్స్ క్లబ్స్ ఇతోధికంగా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పోలినాయుడు మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ద్వారా ఆరోగ్యాన్ని కాపాడే కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేయాలని కోరారు. దేశానికి ఎన్నో ఆరోగ్య సంక్షోభాలు వచ్చినపుడు సైన్స్ తోడుగా నిలిచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ కో ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో మిగిలిన స్వచ్ఛంద సంస్థలకు దీటుగా స్టార్ వాకర్స్ క్లబ్ అనేక కార్యక్రమాలు చేపడుతుందని



అన్నారు.. అలుపెరుగని సేవా కార్యక్రమాలు ఆరోగ్య భారత్ ఆవిష్కరణకు వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ అలుపెరుగని కార్యక్రమాలు చేపడుతుందన్నారు. అంతకుముందు నగరంలోని పలువురు ప్రముఖ వైద్యులను కమిషనర్ హనుమంతు కూర్మారావు సత్కరించారు. ఉత్తమ డాక్టర్స్‌గా సత్కారం అందుకున్న వారిలో.. నగరానికి చెందిన డాక్టర్ హనుమంతు అనిల్, డాక్టర్ కొర్ల విద్యాసాగర్, డాక్టర్ కూన పోలినాయుడు, డాక్టర్ శ్రీనివాసరావు (డెంటల్) డాక్టర్ దన్నాన ప్రవీణ్, డాక్టర్ కిళ్ళారి హరినాయుడులు వున్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సీనియర్ వాకర్స్ కు వైద్య పరీక్షలు నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు మాజీ గవర్నర్లు గేదెల ఇందిరాప్రసాద్, కొంక్యాన మురళీధర్, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గోలీ ఉమా మహేశ్వర రావు, గేదెల లక్ష్మీ, సావుకారి నాగేశ్వరరావు, గద్దిబోయిన కృష్ణారావు, రాడ కైలాసరావు, వావిలపల్లి జగన్నాథ నాయుడు, సీనియర్ జర్నలిస్ట్ నాగేశ్వర ఈశ్వరరావు, కొమ్ము శ్రీనివాసరావు, ఎం.మల్లిబాబు, గోలీ సంతోష్, స్టార్ మహిళా వాకర్స్ ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఈ రెండేళ్లలో ఒక్క ప్రాజెక్టు అయినా తెచ్చారా?

*** మూలపేట పోర్టుపై శ్వేతపత్రం విడుదల చేయాలి * వైసీపీ ప్రభుత్వంలోనే పోర్టు పనుల్లో ప్రగతి * అధికారులను గుప్పిట్లో పెట్టుకొని దోపిడీ * విశ్వసముద్రకు ఎంత బిల్లు ఇచ్చారో బహిరంగపర్చాలి * వైసీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్**




**టెక్కలి, ఏప్రిల్ 7 (వార్త):** మూలపేట పోర్టు అభివృద్ధి పనులపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే శ్వేత పత్రం విడుదల చేయాలని వైసీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు టెక్కలిలోని వైసీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి అచ్చన్న తీరుపై మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన మూలపేట పోర్టుపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోందన్నారు. పోర్టుపై కూటమి నేతల దుష్ప్రచారంపై వైసీపీ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహించామన్నారు. జిల్లాకు గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పెద్ద ఎత్తున అభివృద్ధి చేసామని.. పోర్టుపై అచ్చెన్న అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. పోర్టు పరిశీలనకు అనుమతులు ఇచ్చామని పచ్చి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. పోర్టు సభ విజయవంతంపై సీఎం చంద్రబాబు స్పందించినట్లుగా కనిపిస్తుందన్నారు. అచ్చెన్న అనేక సార్లు పోర్టు పనులు 90 శాతం జరిగాయి...షిప్ వచ్చేస్తోంది అని ప్రచారం చేశారు కానీ ఆర్అండ్‌బీ మంత్రి పోర్టు పరిశీలన చేసి 70 శాతం పనులు జరిగాయని స్పష్టం చేశారన్నారు. పోర్టు పరిశీలనలో ఆర్డీవో ఇచ్చిన కాగితం పైన ఉన్నది మాత్రమే మాట్లాడుతున్నారని, సంవత్సర కాలంలో ఎంత శాతం పనులు జరిగాయో శ్వేత పత్రం విడుదల చేస్తే ప్రజలకు నిజాలు తెలుస్తాయన్నారు. కేవలం మంత్రి పదవి కాపాడుకోవడానికే నోటికి ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నరని, దశాబ్దాలుగా అధికారం దక్కించుకుంటున్న మీరు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. టెక్కలి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీను గెలిపించలేకపోయినా ఇక్కడ వేల కోట్ల అభివృద్ధి చేశారన్నారు. ఇన్నేళ్లు అధికారం ఇచ్చిన మంత్రి అచ్చెన్నాయుడు టెక్కలి నియోజకవర్గానికి చేసిందేమీ లేదన్నారు. ఈ రెండేళ్లలో ఒక్క ప్రాజెక్ట్ తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. మూల పేట, విష్ణు చక్రం గ్రామాల ప్రజలకు నిర్వాసిత కాలనీ ఏర్పాటు చేశారని, మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. ఇప్పుడు భూముల దోపిడీకి అడ్డుగా ఉన్నారని. భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. పోర్టు నిర్మాణానికి అవసరమైన అన్ని రకాల అనుమతులు అప్పుడే ఇచ్చారని తెలిపారు. మా పోరాటం వలనే మంత్రులు పరుగులు పెట్టారన్నారు. పోర్టు అభివృద్ధికి ఒక్క దగ్గర కాకుండా జిల్లా వ్యాప్తంగా వున్న భూముల లో అభివృద్ధి చేయాలన్నారు. విజిలెన్స్, పోలీస్, రెవెన్యూ మొత్తం గుప్పెట్లో పెట్టుకుని దోపిడీ చేస్తున్నారు అని విమర్శించారు. కోర్టు పరిధిలో వున్న సాల్ట్ భూముల్లో దౌర్జన్యం చేస్తున్నారన్నారు. 2024 సంవత్సరం 5వ నెల వరకూ విశ్వ సముద్ర కు ఎంత బిల్లులు ఇచ్చారో బహిర్గతం చేయాలన్నారు. సమావేశంలో సంతబొమ్మాలి జడ్పిటిసి పాల వసంత రెడ్డి, వైసీపీ నాయకులు సత్తారు సత్యం, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి అందరికీ అందడమే..
# నిజమైన ప్రజాస్వామ్యం

*** కొద్ది మంది సంపన్నులకు కొమ్ము కాస్తున్న చంద్రబాబు * నిధుల పంపిణీలో అసమానతల వల్లే తెలంగాణ ఉద్యమం * ఏపీలో మళ్లీ ప్రత్యేక రాష్ట్రం డిమాండ్ * చంద్రబాబుపై మాజీ మంత్రి ధర్మాన ఫైర్**



**శ్రీకాకుళం, ఏప్రిల్ 7 (వార్త):** అభివృద్ధి అన్ని ప్రాంతాలకు సమానంగా అందడమే నిజమైన ప్రజాస్వామ్యమని, కానీ తొలి ప్రధాని నెహ్రూ ఆశయాలకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని వైసీపీ మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆరోపించారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి ఒక తండ్రి లాంటి వారని, అందరినీ సమానంగా చూడాలని కోరారు. కానీ సీఎం కేవలం ఒక ప్రాంతానికే, కొద్దిమంది సంపన్నులకే కొమ్ముకాస్తున్నారన్నారు. శ్రీకృష్ణ కమిటీ హెచ్చరికలను చంద్రబాబు పెడచెవిన పెడుతున్నారని విమర్శించారు. నిధుల పంపిణీలో అసమానతల వల్లే గతంలో తెలంగాణ ఉద్యమం వచ్చిందని చంద్రబాబు గుర్తుంచుకోవాలన్నారు. హైదరాబాద్‌పై పెట్టిన దృష్టి ఇతర ప్రాంతాలపై పెట్టకపోవడం వల్లే విభజన జరిగిందని, మళ్లీ అదే తప్పు చేస్తూ ఉత్తరాంధ్రా, రాయలసీమలకు చంద్రబాబు అన్యాయం చేస్తున్నారని ధర్మాన ఆరోపించారు. విభజన చట్టంలోని సెక్షన్ 6 ప్రకారం నియమించిన నిపుణుల కమిటీని చంద్రబాబు గౌరవించలేదన్నారు. అమరావతి రాజధానికి అనుకూలం కాదని నిపుణులు చెబితే వారిని అవమానించి పంపారన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా అమరావతిని శాశ్వత రాజధానిగా చేస్తూ చట్టాన్ని సవరించారని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాజకీయ అవసరాల కోసం ఈ సవరణ చేయించారని విమర్శించారు. అమరావతి బిల్లు సమయంలో ప్రధాని మోదీ, అమిత్ షా వంటి కీలక నేతలు సభకు రాలేదని, రాష్ట్ర రాజధాని ఫలానా చోటే ఉండాలని చెప్పే అధికారం కేంద్రానికి లేదని గతంలో అఫిడవిట్ ఇచ్చారని ధర్మాన గుర్తుచేశారు. రాజ్యాంగంలో సుప్రీంకోర్టు సీటు గురించి ఉందే తప్ప రాజధాని గురించి ఎక్కడా లేదన్నారు. ఉత్తరాంధ్రా, రాయలసీమ వెనుకబడిన ప్రాంతాలని విభజన చట్టమే స్పష్టంగా చెప్పిందన్నారు. 80 ఏళ్ల వయసులో కూడా ఉత్తరాంధ్రా ప్రజలు పొట్టచేతబట్టుకుని వలస వెళ్తున్నారన్నారు. రాయలసీమ బిడ్డగా ఉండి కూడా ఆ ప్రాంత అభివృద్ధికి చంద్రబాబు ఏం చేశారని నిలదీశారు. వెనుకబడిన ప్రాంతాల్లో కనీసం ఒక్క ఎకరా భూమిని కూడా పేదలకు పంపిణీ చేయలేదన్నారు. 60 ఏళ్లవుతున్నా ఉత్తరాంధ్రాలో ఇరిగేషన్ ప్రాజెక్టులు ఎందుకు పూర్తి కావడం లేదని ప్రశ్నించారు. విశాలమైన తీరప్రాంతం ఉన్నా ఒక్క హార్బర్ రాకుండా అడ్డుకోవడం ధర్మమేనా? అని అడిగారు. రాష్ట్ర బడ్జెట్ రూ. 3.30 లక్షల కోట్లు ఉంటే శ్రీకాకుళం ప్రాజెక్టులకు రూ. 1000 కోట్లు కూడా ఇవ్వరా అన్నారు. లక్ష ఎకరాల్లో అమరావతిని కట్టాలంటే మౌలిక వసతులకే రూ.2 లక్షల కోట్లు కావాలని, అమరావతి నిర్మాణం పూర్తి కావడానికి 50 ఏళ్లు పడుతుందని స్వయంగా ముఖ్యమంత్రే చెబుతున్నారన్నారు. అంతకాలం ఉత్తరాంధ్రా, రాయలసీమ ప్రజలు అభివృద్ధికి దూరంగా ఉండాలా? అని ప్రశ్నించారు. ఒకే ప్రాంతంపై లక్షల కోట్లు ఖర్చు పెడితే మళ్లీ హైదరాబాద్ తరహా విద్వేషాలు వస్తాయన్నారు. భవిష్యత్తు తరాలు ప్రత్యేక రాష్ట్రం కావాలని డిమాండ్ చేసే పరిస్థితి చంద్రబాబే కల్పిస్తున్నారన్నారు. రాష్ట్ర సంపద ఐదు కోట్ల ప్రజలకు చెందాలి కానీ ఒక్క అమరావతికే కాదన్నారు. విశాఖ, విజయనగరంలో వస్తున్న సంస్థల ఆస్తులు ఇతర ప్రాంతాల వ్యక్తులకే చెందుతున్నాయన్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతాలనే మళ్లీ అభివృద్ధి చేస్తే వెనుకబడిన ప్రాంతాలకు గోచీ తప్ప ఏమీ మిగలదన్నారు. ముఖ్యమంత్రి పంతం కోసం ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షలను మరుగున పడేయడం అన్యాయమన్నారు. వలసలు ఆగేలా, స్థానిక ప్రాజెక్టులు పూర్తయ్యేలా నిధులు ఎందుకు కేటాయించడం లేదన్నారు. ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేలా కాకుండా సమాన అభివృద్ధికి సీఎం బాటలు వేయాలని కోరారు. అమరావతి పేరుతో వెనుకబడిన జిల్లాల నోళ్లు నొక్కడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. చంద్రబాబు తన నిర్ణయాలను పునరాలోచించుకోవాలని మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు డిమాండ్ చేశారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546